అప్పు తీర్చనందుకే మహిళ హత్య

కేసును ఛేదించిన పోలీసులు... వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి

వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి, (ఇన్‌సెట్‌లో రికవరీ చేసిన వస్తువులు)

వికారాబాద్, జనవరి 19 : గుర్తు తెలియని మహిళా హత్య కేసును 48 గంటల్లోనే పోలీసులు ఛేదించినట్లు వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. శుక్రవారం వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో హత్యకు గల కారణాలను ప్రెస్‌మీట్‌లో ఎస్పీ వివరించారు. సంక్రాంతి పండుగ రోజు వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామ శివారులో సగం దహనమైన మహిళా మృతదేహం కనిపించిందని గ్రామ సర్పంచ్ మాధవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వికారాబాద్, ధారూరు పోలీసులు, క్లూస్ టీమ్ ఆధారంగా ఆధారాలు సేకరించారు. మృతురాలు చేవెళ్లకు చెందిన ఎర్రోళ్ల అనసూయ (30-35)గా గుర్తించారు. ఐదేండ్ల కింద భర్త చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేది. ధారూరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన అవుసుపల్లి బాబు కూలీ పనులు చేస్తున్న సమయంలో వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడింది. కొన్ని రోజుల కింద అనసూయ కొంత డబ్బును అప్పుగా తీసుకొని తిరిగి ఇవ్వకపోవడంతో గొడవలు ఏర్పడ్డాయి. అనసూయను హత్య చేసేందుకు బాబు పథకం వేశాడు. జనవరి 14న వికారాబాద్‌లో మద్యం తీసుకొని అనసూయతో కలిసి సేవించాడు. ఇద్దరి మధ్య గొడవ రావడంతో కోపంతో బాబు ఆమె చీర కొంగుతో మెడకు చుట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని గుర్తించకుండా తగులబెట్టాడు. ఆమె ఒంటిపై ఉన్న కమ్మలు, కడియాలు, సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లాడు. బంగారం కోసం గుర్తు తెలియని వ్యక్తులు మహిళను హత్య చేసినట్లుగా చిత్రీకరించాడు. 15న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 4, 5 ప్రత్యేక బృందాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు అసలు విషయం తెలిసింది.

చేవెళ్లలో మహిళ అదృశ్యం కేసు నమోదు కావడంతో వారి కుటుంబ సభ్యులను వివరాలు అడుగగా ఎర్రళ్లో అనసూయగా గుర్తించారు. సెల్‌ఫోన్ నంబర్, సీసీ టీవీ పుటేజీ ఆధారంగా అవుసుపల్లి బాబును అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా అసలు విషయం తెలిసింది. మృతురాలి వద్ద తీసుకున్న కమ్మలు, కడియాలు, సెల్‌ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి, కేసు నమోదు చేశారు. హత్య కేసును ఛేదించిన అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ నర్సింహులు, వికారాబాద్ టౌన్ సీఐ శ్రీను, సీఐ ఆంజనేయులు, ధారూరు ఎస్సై సంతోష్, అనిత, నవాబుపేట ఎస్సై భరత్ భూషణ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

బౌటర్ రింగ్ రోడ్డు

యథేచ్ఛగా..!

- రాత్రి సమయాల్లో రెచ్చిపోతున్న మందుబాబులు
- పరిధిపై పోలీస్ స్టేషన్ల మధ్య తేలని పంచాయితీ
- కనిపించని ఓఆర్ఆర్ పెట్రోల్ మొబైల్ వాహనాలు
- అక్రమార్కులకు అనువైన ప్రాంతాలుగా మారిన సర్వీస్ రోడ్లు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లు

ఇబ్రహీంపట్నం, జనవరి 19 : జిల్లాలోని శివారు ప్రాంతాల్లో ఉన్న ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.. నగరం చుట్టూ విస్తరించి ఉన్న ఓఆర్ఆర్.. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలోనే ఉన్నది. జిల్లా పరిధిలోకి వచ్చే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లు అసాంఘిక శక్తులకు ఆశ్రయాలుగా మారాయి. ముఖ్యంగా గంజాయి స్మగ్లర్లు, అక్రమ సంబంధాల వారికి, మర్డర్లు చేసేవారు ఈ ప్రాంతాన్ని అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్లల్లో తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. మరోవైపు ప్రేమికులు.. వివాహేతర సంబంధాల వారూ ఓఆర్ఆర్ పరిసర ప్రాంతాలను ఎంచుకుంటున్నారు. దీంతో సర్వీస్ రోడ్డు పరిసరాల్లో పెద్ద ఎత్తున అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన పెట్రోల్ మొబైల్ వాహనాలు కూడా అంతంత మాత్రంగానే ఉండడం వల్ల అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ముఖ్యంగా రాజేంద్రనగర్, శంషాబాద్, ఆదిబట్ల, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్లు ఉన్నాయి. జిల్లాలో సుమారు 100 కిలో మీటర్ల పొడవునా ఓఆర్ఆర్ కిరువైపులా సర్వీస్ రోడ్లు ఉన్నాయి. ఈ రోడ్ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా సాగుతున్నాయి. మరోవైపు ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పెట్రోల్, ఓఆర్ఆర్ పెట్రోల్ మొబైల్ వాహనాలు వీటిపై దృష్టి సారించటం లేదు. దీంతో సర్వీస్ రోడ్లవెంట ఇటువంటి దుశ్చర్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

గంజాయి స్మగ్లర్లకు అనువుగా..

ఆంధ్రప్రదేశ్.. తదితర రాష్ట్రాల నుంచి ముంబాయి వంటి ప్రాంతాలకు గంజాయి రవాణా చేస్తున్న స్మగ్లర్లు ఓఆర్ఆర్‌ను అనువైన ప్రాంతంగా ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా విజయవాడ హైవే నుంచి వస్తున్న గంజాయి స్మగ్లర్ల వాహనాలు అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కి ముంబాయి రోడ్డులో దిగుతున్నారు. ఓఆర్ఆర్‌పై ఎలాంటి చెకింగ్ లేకపోవడం వల్ల గంజాయి స్మగ్లర్లు గుట్టుచప్పుడు కాకుండా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. గంజాయి అక్రమ రవాణాపై స్పష్టమైన సమాచారం ఉన్నప్పుడే ఎక్సైజ్ పోలీసులు, స్థానిక పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నారు. ఇటీవల అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, ఆదిబట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో పెద్ద ఎత్తున గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న పలు వాహనాలతో పాటు వ్యాపారులనూ అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. అయినప్పటికీ రాత్రిపూట యథేచ్ఛగా గంజాయి అక్రమ వ్యాపారం సాగిస్తున్నారు.

పోలీస్ స్టేషన్ల మధ్య పరిధి పంచాయితీ..

ఓఆర్ఆర్‌తో పాటు సర్వీస్ రోడ్లపై పలు పోలీస్ స్టేషన్ల మధ్య స్పష్టమైన పరిధి లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ఓఆర్ఆర్ ప్రాంతం ఆదిబట్ల, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, శంషాబాద్, రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసుస్టేషన్ల మధ్య పరిధి పంచాయితీలు ఎక్కువగా ఉన్నాయి. ఓఆర్ఆర్‌కి ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్లల్లో, లోపలి సర్వీస్ రోడ్డు హయత్‌నగర్, బయటి సర్వీస్ రోడ్డు అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోకి వస్తాయి. ఈ సర్వీస్ రోడ్లతో పాటు ఓఆర్ఆర్‌పై జరిగిన ప్రమాదాల విషయంలో రెండు పోలీస్ స్టేషన్ల మధ్య సరైన స్పష్టత లేదు. దీంతో ప్రమాదాలు జరిగిన వెంటనే ఏ పోలీసులకు సమాచారం ఇచ్చినా.. తమ పరిధి కాదంటే.. తమ పరిధి కాదని దాటవేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రమాదాలు జరిగిన తర్వాత పరిధి ఎవరికి వస్తుందో తెలుసుకుని సంబంధిత పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారు. ఈలోగా క్షతగాత్రుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి.

సర్వీస్ రోడ్లవెంట మృతదేహాల కలకలం..

ఓఆర్ఆర్‌తో పాటు సర్వీస్ రోడ్లల్లో పోలీసుల గస్తీతో పాటు వాహనాల తనిఖీలు లేకపోవడం వల్ల నేరస్తులు ఈ ప్రాంతాన్ని ఎంచుకుంటున్నారు. ఎక్కడో హత్యలు చేసి మృతదేహాలను ఇక్కడ పడవేసి వెళ్లడంతో పాటు ఎవరైనా హత్యలు చేయాలన్నా ఈ ప్రాంతాన్నే అనువుగా ఎంచుకుంటున్నారు. రాత్రివేళల్లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లల్లో వెళ్లాలంటే ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్లల్లో పోలీసుల గస్తీని ముమ్మరం చేసి అసాంఘిక శక్తులను ఆట కట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్లల్లో గస్తీ పెంచుతాం..

ఓఆర్ఆర్‌తో పాటు సర్వీస్ రోడ్లల్లో ప్రమాదాల నివారణకు ప్రత్యేక గస్తీ పెంచుతాం. సర్వీస్ రోడ్ల వెంట లభిస్తున్న మృతదేహాలతో పాటు ఇతర ప్రమాదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే పలు సమస్యలు దృష్టికి వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరికట్టడానికి ప్రత్యేకంగా కృషి చేస్తాం.

– సునీతారెడ్డి, డీసీపీ మహేశ్వరం

మౌంట్ అకాన్కాగువా పర్వతారోహణకు వెళ్లిన బలరాం రాథోడ్

బొంరాస్‌పేట, జనవరి 19 : అమెరికాల అత్యంత ఎత్తైన పర్వతం(22,838 అడుగులు) అధిరోహించడానికి బొంరాస్‌పేట మండలం సత్తుర్‌కుంట తండాకు చెందిన బలరాం రాథోడ్ సిద్ధమయ్యాడు. ఆండీస్ పర్వత శ్రేణుల్లో ఉన్న ఈ ఎత్తైన పర్వతాన్ని అధిరోహించడానికి బలరాం శుక్రవారం అర్జెంటీనాకు బయలుదేరి వెళ్లారు. పర్వతారోహణపై ఎంతో ఆసక్తి పెంచుకుని ఇప్పటికే కిలిమంజారో, ఎల్‌బ్రోస్, రెనోక్, లకోకాంగ్సి పర్వతాలను అధిరోహించాడు. పర్వతారోహణతో బలరాం రాథోడ్ గిన్నిస్ బుక్ రికార్డులో చోటు సంపాదించాడు. ఈ నెల 21న పర్వతారోహణ ప్రారంభమవుతుందని బలరాం తెలిపారు. -25 డిగ్రీల ఉష్ణోగ్రతలో 21 రోజుల పాటు పర్వతారోహణ చేయాల్సి ఉంటుందని తెలిపారు. బలరాం రాథోడ్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

అల్పసంఖ్యాక గురుకుల బాలుర, కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జనవరి 19 : వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అల్ప సంఖ్యాక గురుకుల బాలుర, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వికారాబాద్ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రాత్లావత్ ఫకీరా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం 2024-2025 కు గాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బీపీసీ గ్రూపులకు దరఖాస్తులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఈనెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు స్థానిక మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల కళాశాలలో దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 9959746436కు సంప్రదించాలన్నారు. TMREIS.Telangana.cgg.in ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల జీతాలు పెంచాలి

రాష్ట్ర గిరిజన శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఉపాధ్యాయుల సంఘం నాయకులు

కులకచర్ల, జనవరి 19 : గిరిజన ఆశ్రమ పాఠశాల, గిరిజన విద్యా శాఖలో రాష్ట్ర మైదాన ప్రాంత అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ ఉపాధ్యాయుల జీతాలు పెంచి ఆదుకోవాలని కోరుతూ షెడ్యూల్ ట్రైబ్స్ అడ్వాన్స్‌డ్ రెసిడెన్షియల్ స్కూల్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర గిరిజన శాఖ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల ఉపాధ్యాయుల సంఘం సభ్యులు మాట్లాడుతూ గత నెలలో 12వేల వేతనం పొందిన తమకు వచ్చే వేతనాన్ని తగ్గించి రూ.7373 మాత్రమే చెల్లించారన్నారు. తగ్గించిన వేతనం మాకు వద్దని జీవో నంబర్ 60, టీడబ్ల్యూడీ 1381 ప్రకారం జీతాలు ఇవ్వాలని కోరారు. మాతో పాటు సీఆర్టీ రెగ్యులర్ ఉపాధ్యాయులు పని చేస్తున్న మాదిరిగానే తాము కూడా విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కులకచర్ల మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌నాయక్, గోపాల్‌నాయక్, రాజూనాయక్ సంఘం అధ్యక్షుడు రామావత్ మున్యానాయక్, ఉపాధ్యక్షుడు రాథోడ్ రాజేందర్, సురేందర్, ప్రధాన కార్యదర్శి శంకర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నట్యా రామ్మోహన్, నర్సింగ్, రమేశ్, చందర్, కవిత, తారాబాయి, విజయ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గాయపడిన జింక

దోమలో గాయపడిన జింకకు చికిత్స చేయిస్తున్న అధికారులు

- వెటర్నరీ వైద్యులతో చికిత్స చేయించిన పోలీసులు
- అటవీ శాఖ అధికారులకు అప్పగింత

దోమ, జనవరి 19 : కుక్కల దాడిలో జింక గాయపడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలోని చిప్పోనికుంట దగ్గర జింకను చూసి కుక్కలు వెంబడించాయి. జింక భయంతో పరుగులు పెడుతుండగా చెట్ల మధ్యలో కొమ్ములు ఇరుక్కుపోయాయి. ఇదే అదునుగా తీసుకున్న కుక్కలు జింక తొడ భాగాన్ని గాయపరిచాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వెటర్నరీ వైద్యులతో చికిత్స చేయించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో పోలీసులు, వెటర్నరీ వైద్యులు, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు ఉంటే నేరుగా కలువొచ్చు..

- సివిల్ తగాదాల్లో పోలీసుల జోక్యం ఉండదు
- సైబర్‌క్రైం, డ్రగ్స్, గంజాయిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి
- మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి
- ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో వివిధ పార్టీల నాయకులు, ప్రజలతో సమావేశం

మాట్లాడుతున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఆదిబట్ల, జనవరి 19 : ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా కలువొచ్చని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌లో స్థానిక రాజకీయ నాయకులు, ప్రజలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలో సైబర్‌క్రైం, గంజాయి, డ్రగ్స్ వినియోగాలు పెరిగాయని, వాటిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ప్రాంతంలో బయటి రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు జీవనోపాధికి వచ్చి, గంజాయి తరలిస్తూ ఎంతో మంది పట్టుబడ్డారన్నారు. తెలంగాణ ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై చాలా సీరియస్‌గా ఉన్నదన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను వినియోగిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రతి ఒక్కరూ సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎవ్వరినీ ఉపేక్షించేది లేదన్నారు. ఈ ప్రాంతంలో అత్యధికంగా భూ సమస్యలు ఉన్నాయన్నారు. సివిల్ తగాదాల్లో పోలీసులు ఎలాంటి జోక్యం చేసుకోరని తెలిపారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్టంగా ఉన్నదని, ఎక్కడ తప్పు చేసినా తప్పించుకోలేరన్నారు. ప్రతి గ్రామంలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్సైలు శ్రీనివాస్, కృష్ణయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

వికారాబాద్/ఇబ్రహీంపట్నం, జనవరి 19 : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం సందర్భంగా 18-19 సంవత్సరాల వయస్సు ఉన్న యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ కలెక్టర్లు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం సంబంధిత అధికారులతో రెండు జిల్లాల కలెక్టర్లు మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. ముఖ్యంగా 18 ఏండ్లు పూర్తి చేసుకున్న యువతీ యువకులందరూ తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద నిర్ణీత 6, 7, 8 దరఖాస్తు ఫారాలతో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఓటరు ముసాయిదా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు, సవరణలు, తొలగింపులు చేపట్టాల్సి ఉన్నట్లయితే, వాటిని సరిచేసుకునేలా చూడాలన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సందర్భంగా గుర్తించిన అంశాలను పరిగణలోకి తీసుకొని డూప్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లను, సిమిలర్ ఫొటో ఎంట్రీ, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీ ఓటర్లను గుర్తించడం జరిగిందన్నారు. అలాంటి వారికి నోటీసులు పంపించి ఓటరు జాబితా నుంచి అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తుది జాబితాలో ఏ ఒక్క డూప్లికేట్ పేరు ఉండకుండా క్షుణ్ణంగా పరిశీలన జరపాలని సూచించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల కోసం వెంటనే ప్రింటింగ్ కోసం సమగ్ర వివరాలతో జాబితాను పంపించాలని ఎన్నికల విభాగం అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడైనా నివాస ప్రాంతానికి రెండు కిలోమీటర్లకు పైబడి దూరంలో పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లయితే, వాటి వివరాలు తెలియజేయాలని సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న విస్తృత స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వికారాబాద్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాసరావు, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు సూరజ్‌కుమార్, సాయిరామ్, శ్రీనివాస్, మల్లయ్య, అనంతరెడ్డి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, డిప్యూటీ తహసీల్దార్ బీఎస్ కుమారి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ సి.నారాయణరెడ్డి, రంగారెడ్డి కలెక్టర్ శశాంక

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్, జనవరి 19 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును రంగారెడ్డి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. సహకార సంఘాల అభివృద్ధికి సహకారం అందించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ నాయకులు కృష్ణ, రాజాబాబు తదితరులు పాల్గొన్నారు.

'భూ సమస్యలు పరిష్కరించండి'

మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధక్షుడు గడిగే గజేందర్‌గౌడ్

షాబాద్, జనవరి 19: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు సర్వే నిర్వహించి టైటిల్ గ్యారెంటీ ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి కోరారు. శుక్రవారం షాబాద్ మండలంలోని నాగరగూడ శ్రీ కృష్ణా దేవాలయం వద్ద నిర్వహించిన భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై తమ సంఘం దశాబ్దాల కాలంగా పోరాటం చేస్తున్నదన్నారు. ప్రతి గ్రామం నుంచి సంఘం సభ్యత్వాలు చేయించాలని సూచించారు. భారతీయ కిసాన్ సంఘ్ రంగారెడ్డి జిల్లా అధక్షుడు గడిగే గజేందర్‌గౌడ్ మాట్లాడుతూ 18 ఏండ్లు దాటిన స్త్రీ, పురుషులకు సభ్యత్వాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, పాలమూరు జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి, షాబాద్ మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ నేడు విడుదల

జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 19 : వికారాబాద్ జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ 20వ తేదీ ప్రతి పాఠశాలలో నోటీసు ఇవ్వడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారిణి రేణుకాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రోజు పాఠశాలలో ఉన్నటువంటి తల్లిదండ్రుల జాబితా కూడా నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. 22, 23 తేదీల్లో తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామని తెలిపారు. 24 బుధవారం ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక కోసం తల్లిదండ్రుల తుది జాబితా ఖరారు చేసి అట్టి జాబితాను పాఠశాల నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. 29న ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం 1:30 కి ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికైన ఎస్ఎంసీ మెంబర్స్ మొదటి సమావేశాన్ని 29న మధ్యాహ్నం రెండు గంటల నుంచి 4 గంటల వరకు నిర్వహించాలన్నారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు చొప్పున తల్లిదండ్రులను ఎన్నుకుంటారని, ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు కచ్చితంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకుగాను 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఏడు తరగతులకుగాను 21 మందిని, హై స్కూల్‌కి సంబంధించి 6 నుంచి 8 తరగతికి గాను 9 మందిని మెంబర్స్‌గా ఎన్నుకుంటారన్నారు. వీరిలో నుంచే చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులకు ఎంఈవోలకు ఎంఎన్‌వోలకు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఎన్నిక సజావుగా నిర్వహించి 30న లిస్టులను డీఈవో ఆఫీసుకు అందించాలని ఆదేశించారు.